# అచలపతి - విచిత్రకోతి

**"అ**చలపతి ఉన్నాడా ....? ఓ సలహా కావాలి.." అంటూ ప్రవేశించాడు మా రాఘవ.

నాకిదే ఒళ్లు మండుతుంది. నా దగ్గరికి వచ్చిన ప్రతీవాడూ అడిగే మొదటి ప్రశ్న ఇదే! మీరు కూడా నా లాగ – అంటే అన్నిటా సాయపడే అసిస్టెంటును – ఏర్పరుచుకుందామంటే మాత్రం అచలపతిలాటి తెలివైనవాడిని పెట్టుకోకండి. అందరూ అతని చుట్టూనే తిరిగి మిమ్మల్ని నిర్లక్ష్యం చేస్తారు. మీరూ తెలివితేటలు గలవాళ్లేనని నిరూపించుకోవడానికి చాలా అవస్థలు పడాల్సివస్తుంది. మద్రాసులో అలాటి అవస్థలు పడి, పడి.. హాలీడేయింగ్‌కని ఢిల్లీ వస్తే ఇక్కడా ఇదే తంతు. పోనీ అడిగినవాడు అచలపతి ఫ్రెండా? కాదు.. నా క్లాస్‌మేట్. ఢిల్లీలో ఉద్యోగం వెలగబెడుతున్నవాడు. మరి ఏమిటీ దురన్యాయం? అదే అడిగేను.

"ఇది కాస్త కాంప్లికేటెడ్ వ్యవహారం లేరా అనంతం! నీదసలే మట్టిబుర్ర. ఓవర్ వర్క్ చేస్తే హేంగయి పోతుంది.. "అంటూనే నేను ఎర్రగా చూడడం చూసి, "సర్లేలేరా, నీకు తొమ్మిదో క్లాసు క్విజ్‌లో ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని నాకు గుర్తుందిలే, కానీ అదెలా వచ్చిందో నీకు గుర్తుందా?" అంటూనే అచలపతిని వెతకబోయాడు.

ఈమధ్య నా తెలివితేటలు మీద అనుమానం వచ్చినవారందరికీ ఆ క్విజ్ ప్రైజు గురించి చెబుతున్నాడని వీడికెవరో – మా క్లాసుమేట్లే అయుంటారు లెండి – చెప్పేసి ఉంటారు. యూస్‌లెస్ ఫెలోస్. లోకంలో అన్ని విషయాలుండగా నా గురించే మాట్లాడవలసిన పనేముంది వీళ్లకు?

'అదెలా వచ్చిందో గుర్తుందా?' అన్న రాఘవ డైలాగువల్ల నా అంత తెలివైన పాఠకులకు

అనుమానం వచ్చేసి ఉంటుంది– పప్పులో నలుపు ఉందని (దాల్ మేఁ కుఛ్ కాలాకు తెలుగురూపం, ఢిల్లీకి వచ్చిన వారంరోజుల్లో ఈమాట పదిసార్లు విన్నాను. ముందులో కందిపప్పు మాడిందేమో ననుకునేవాణ్ని. తర్వాత అర్థం తెలిసాక, తెలుగు భాషను సుసంపన్నం చేయడానికి హిందీని కూడా వాడుకోవాలని నిశ్చయించుకున్నాను) అనుమానించే పాఠకులకు కన్‌ఫెస్ చేసి నా హృదయభారం తగ్గించు కుంటున్నాను. ఆ రోజు నేను క్విజ్ నెగ్గడంలో రాఘవ గాడి పాత్ర కాస్త ఉంది – అంటే వెనక్కాల నిలబడి సైగలు చేసి ఆన్సరు చెప్పడంలో. కానీ మరో విషయం గుర్తించాలి – సైగలు అర్థం చేసుకోవడంలో నేను అసమాన ప్రతిభ ప్రదర్శించడం బట్టే నాకు ప్రైజు దక్కిందని. కానీ రాఘవకు ఆ ఇంగితం లేదు. తన మాట కాదన్నప్పుడల్లా ఆ విషయం అందరికీ చెప్పేస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తాడు.

అచలపతిని పిల్చుకొచ్చి, నా ఎదురుగానే వాడి గాథంతా చెప్పాడు. ఢిల్లీలో ప్రస్తుతం వింతమనిషి కనబడుతున్నాడన్న వార్తలు మా వాడూ విన్నాడు. ఆ మనిషి కనబడటం లేదుగాని, అతను కనబడ్డాడని చెప్పేవాళ్లు మాత్రం చాలామంది కనబడ్డారు.. టీవీలో. మా రాఘవకు ఉబలాటం పుట్టింది, తను మాత్రం టీవీలో ఎందుకు కనబడకూడదని.

తక్షణం టీవీ వాళ్లకు ఫోన్ చేసి చెప్పాట్ట. నాకూ నిన్న రాత్రి మా ఇంటి డాబా మీద ఆ సదరు మనిషి కనబడ్డాడని. తీరా పిలిచేశాక వీడికి భయం పట్టుకుంది– వాళ్లొచ్చి ఆ వింతమానిసి ఎలా ఉన్నాడని అడిగితే ఏం చెప్పాలాని. అందుకే పరిగెత్తుకు వచ్చాడు. అంతా విని, అచలపతి మెత్తగా దగ్గాడు. అంటే ముఖ్‌మల్‌గుడ్డతో ఓ పంచ్ ఇవ్వబోతున్నాడన్నమాట.

"సర్, ఇటువంటి విషయాల్లో నా అభిప్రాయాలు మీ అభిప్రాయాలకు భిన్నంగా ఉండడానికి ఎక్కువ అవకాశం ఉంది. ఎందుకంటే ప్రచార ప్రీతి ఒక అంశం, ప్రజలను తప్పుదోవ పట్టించడం మరొక అంశం. అసలే మూఢప్రజలు లెక్కకు మిక్కిలిగా ఉన్న ఈ దేశంలో వారిని గందరగోళపరచడం ఎంతవరకు సమంజసమో ఎవరికి వారే ఆలోచించి...."

రాఘవ నా కేసి దీనంగా చూశాడు – ఏమిటీ భాషణం? ఏమిటీ దీనర్థం? అన్నట్టు. నేను విజయగర్వంతో నవ్వాను. అచలపతిని తెలుగులోకి అనువదించాను. "దానర్థం ఇటువంటి పనులు అచలపతి సిద్ధాంతాలకు విరుద్ధం. విరుద్ధమైనా నేను

చెప్తే కాదనడు కానీ, నేను చెప్పను. ఆ చెప్పేదేదో నీకే చెబుతాను – సలహా !"

వాడు అదోలా చూశాడు. వాచీ కేసి చూసుకున్నాడు. వేరేవరి దగ్గరికీ వెళ్లడానికి టైము లేదని గొణుక్కున్నాడు. "సరే, నువ్వే చెప్పు. ఏం చేస్తావో, చూద్దాం..." అన్నాడు దీనంగా. అంటూనే ఇంకో మాట చేర్చాడు – "దీంట్లో నేను సైగలు చేసి చెప్పను. నీ స్వంత తెలివితేటలే ఉపయోగించాలి మరి!" అన్నాడు. (ఈ ఆశ్చర్యార్థకం నేను పెట్టింది కాదు, వాడే! రాస్కెల్!)

ప్రజలకు మంచి చేద్దామని సదుద్దేశ్యం గట్టిగా ఉంటే ఇటువంటి విసుర్లు మననేం చేయలేవు. "చూడు రాఘవా, నాకు విషయం సమగ్రంగా అర్థమయింది. ఆ ఆకారం గురించి నువ్వు ఎంత వింతగా చెబితే నీకంత పబ్లిసిటీ వస్తుందన్న సంగతి నాకు తెలుసు. నా ఐడియా ఫలించి బిబిసి వాళ్లు కూడా వచ్చి నిన్ను ఇంటర్వ్యూ తీసుకుంటే, నువ్వు కృతజ్ఞతాభారంతో నా ఫోటో మీ ఇంట్లో పెట్టుకుందామనుకుంటే మాత్రం ఇప్పుడే ఫోటోగ్రాఫరుని తీసుకురావద్దు. నిన్ననే క్షవరం చేయించుకున్నాను. కావాలంటే మద్రాసు వెళ్లి మంచి ఫోటో పంపిం...."

"ముందు ఐడియా ఏడు" అన్నాడు రాఘవ పళ్లసందులోంచి.

"చూడు, నీ దగ్గర ఉన్న ఆప్షన్స్ ఏమిటోచూద్దాం. నువ్వు ఆ వింతమనిషిని రాక్షసుడు అనవచ్చు. కానీ నిన్ను భోంచేయకుండా వట్టినోటితో ఎందుకు వెళ్ళిపోయాడని అడిగితే సమాధానం చెప్పడం కష్టం. ఇ. టి. అనవచ్చు. కానీ గ్రహాంతరవాసుల గురించి మరీ ప్రశ్నలు అడిగితే కష్టం. ఎన్ని సైఫీ సినిమాలు చూసినా ఊహించడం కష్టం. శుభ్భరంగా ఓ విచిత్రకోతిని చూసానని చెప్పు. ముందే బ్లేడుతో ఒళ్లు గీరుకుని కూచో. కోతి గీరిందంటే నమ్ముతారు... ఆగాగు, జస్ట్ కోతి అంటే గ్లేమర్ ఉండదు. అది అంజనేయుడి అవతారం అని చెప్పేయ్. బోల్డంత పబ్లిసిటీ".

"నమ్ముతార్రా? ఆంజనేయుడికి ఇలా రావాల్సిన పనేముందంటే?" రాఘవ గొంతులో ఆనందంతో బాటు అనుమానం.

"ఆ మాటకొస్తే ఆ మధ్య వినాయకుడికి దాహం వేసిందనేనా బోల్డు పాలు తాగాడు!? తర్వాత ఎవరైనా ఆయనకి కూల్‌డ్రింకేనా ఇప్పించారా ? వేలం వెర్రిలో పడ్డ జనం ఇలా అడగర్రా".

"అప్పుడు కూడా పనిలో పనిగా చాలా మంది దేవుళ్ల బొమ్మలకు పాలు పట్టించారు సర్. ఒక చెప్పులు కుట్టేవాడు తన ఇనపదిమ్మకు కూడా పాలుపట్టి చూపించాడు.

అయినా  జనం గణపతి బొమ్మవెంటే పడ్డారు". సమాచారం అందించాడు అచలపతి.

"ఎవరు తాగినా తాగకపోయినా  విష్ణుమూర్తి బొమ్మ మాత్రం  తాగి వుండదు. పాలసముద్రంలో  పడుక్కుని, పడుక్కుని పాలు మొహం మొత్తివుంటాయి. అసలు నేనే విష్ణుమూర్తయితే మకాం మార్చేసి ఉండేవాణ్ని. పెరుగు సముద్రంలో  స్నానం చేసి వచ్చిన  భక్తుడెవడైనా అలాగే  వచ్చేసాడనుకో.  ఆ పాలన్నీ  పెరుగయికూచుని మా చెడ్డ ఇబ్బంది.."

"నాయనా, అనంతశయనం...  ఆ పేరు పెట్టినంత మాత్రాన  నువ్వు విష్ణుమూర్తి కావులే గానీ, నే పోతున్నా. రేపొచ్చి థ్యాంక్స్ చెబుతానులే " అని పరుగుతీసాడు రాఘవుడు.

రేపు అన్నవాడు  మాట  నిలబెట్టుకోవాలా.. లేదే! అవాళ  సాయంత్రమే దిగబడ్డాడు. వస్తూనే నాకు అక్షింతలు వేశాడు. వాణ్ని సరిగ్గా  ట్రెయిన్ చేయలేదుట. గొడవేమిటన్నాను. రిపోర్టర్లు వీడు  చెప్పినదంతా విని, "అంతా బాగానే వుంది గానీ, అంజనేయుడు సగం గీరి, ఆ తర్వాత గీరడం ఎందుకు మానేశాడు?"  అన్నారట. వీడు ఏం చెప్పాలో తోచక, "ఆంజనేయ దండకం చదివాను.  దాంతో మురిసిపోయి ఆశీర్వదించి  వెళ్లిపోయాడు" అన్నాట్ట.  దండకం చదివి  వినిపించుకుని, "ఇది తెలుగులో  ఉంది కదా,  అంజనేయుడుకి  తెలుగువచ్చా ?" అని ఆరా తీసేట్ట ఒకడు.

"హనుమంతుడు తెలుగువాడే ననాల్సింది. ఆయనది దండకారణ్యప్రాంతం తెలుసా. అసలు మన ప్రాంతంలో  సవరలు గోచీ  పొడుగ్గా పెడతారు కాబట్టి, వాళ్లనే కోతులుగా పొరబడి వాల్మీకి అలా రాసేసేడని  ఓ వాదం ఉంది విన్నావా? హనుమంతుడు అసలు,  సిసలు తెలుగువాడు కాబట్టే తనకే లాభమూ లేకపోయినా, లంక కెళ్లి తన తోక కాల్చుకుని, అక్కడంతా  తగలేసి వచ్చాడంటారు తెలుసా" అన్నాను నేను విసురుగా.

"అచలపతి నీ దగ్గర చేరిన తర్వాత  నీకు చాలా విషయాలు తెలిసాయిరా" అన్నాడు రాఘవ కళ్లు విప్పార్చి చూస్తూ.

ఒంటిమంటను  కళ్లలోకి వ్యాపించకుండా చూసుకుంటూ, "ఏడిశావులే, ప్రతీవాడూ ఇదే మాట. ఎందుకొచ్చిన గోల, హనుమాన్ చాలీసా  అని చెప్పలేకపోయావా?" అన్నాను  విసుగ్గా.

"అది మనకు రాదుగా. చిన్నప్పటినుంచీ అలవాటు పడ్డది కాబట్టి దండకం అనేశాను.." అని రాఘవ చెబుతూండగానే అచలపతి  అడ్డుపడ్డాడు.  "సర్,

హనుమంతుడికి హనుమాన్ చాలీసా మాత్రం తెలుసన్న నమ్మకం ఏమిటి?”

“చూడు అచలపతీ, నీ గ్రే సెల్స్ వెలిసిపోయాయని అనుమానం వస్తోంది. ఆ మధ్య ‘హిమాలయగుహల్లో హనుమంతుడి ఫోటో’ అని పంచిపెట్టలేదూ, దాంట్లో హనుమంతుడు ఏం చదువుతున్నాడు? తాళపత్రమా...? కాదే! బైండు చేసిన రామచరితమానస్! హనుమాన్ చాలీసా దాంట్లోదే అనుకుంటాను..”

“మీ అకడమిక్ డిస్కషన్ కాస్త ఆపరా బాబూ, నేను చెప్పేది కాస్త విను. నువ్వు రేపు రాత్రి అంజనేయుడి అవతారంలా మా డాబా మీదకు రావాలి”. అని తీర్మానించేశాడు రాఘవ. నాకు కళ్లు తిరుగుతూండగానే వాడు చెప్పాల్సింది చెప్పేశాడు. ఆ జర్నలిస్టు హేతువాదం సంఘం వాళ్లను వెంటబెట్టుకు వస్తాడట. వీడు దండకం చదివి అంజనేయుడిని మెప్పించి రప్పించాలట.

అందువల్ల నేను విచిత్రకోతి వేషంలో వచ్చి, హనుమంతుడి అవతారాన్ని అని చెప్పి వాళ్లేదైనా తెలుగులో అడిగితే సమాధానం చెప్పాలట. లోకల్‌గా ఎవర్నైనా ఏక్టర్లను పిలవచ్చు గానీ వాళ్లకు తెలుగురాదుట. పైగా రాఘవా, నేనూ ఒకళ్ల రహస్యాలు ఒకరం బాగా కాపాడుకోగలంట. చివరిమాట నా క్విజ్ ప్రైజు గురించని మీరీపాటికి పసిగట్టేసి ఉంటారు. అచలపతి అడ్డుపడబోయేడు కానీ, స్కూల్మేట్స్ మధ్య నా పరువు పోకుండా కాపాడుకోవడానికి ఈపాటి త్యాగం తప్పదని చెప్పాను.

కానీ ఎంత త్యాగానికైనా కొన్ని హద్దులు ఉంటాయ్. తోక మాత్రం పెట్టుకోనని, కిరీటం, మెళ్లో పతకాలు, గదలు ఇవన్నీ మనకి కుదరవని చెప్పేను. రాఘవ ఏమనుకోలేదు. ‘నువ్వు చెప్పిన ఫోటోలో హనుమంతుడు కూడా ఇవన్నీ పెట్టుకోలేదుగా. అవి నమ్మినవాళ్లు ఇవి నమ్మకుండా ఉంటారా?’ అన్నాడు చులాగ్గా.

“ఒరే, నా చేతికి హిందీ పుస్తకం ఇచ్చి చదవమంటే మాత్రం కుదరదు. అసలే మన హిందీ చాలా వీక్..’ అని నేను చెప్తూండగానే, “వెధవ మాడెస్టీ నువ్వూనూ. హిందీ ఒకటేనేట్రా వీక్.. నాకు తెలుసులే కానీ.. నీకు పుస్తకం ఎవరూ ఇవ్వరూ లేరా. నువ్వు పదిగంటలకల్లా వచ్చేసి డాబా మీద వాటర్ ట్యాంక్‌లో దాక్కో... నీళ్లు తీయించేస్తానులే.. వాళ్లు పదకొండు గంటలకు వచ్చాక నేను దండకం చదవడం మొదలుపెట్టాక నువ్వు ఆ ట్యాంక్ మీద ప్రత్యక్షమవు. వాళ్లేమైనా అడిగితే అక్కణ్నుంచే సమాధానాలు చెప్పు. హిందీ రాకపోతే ఇంగ్లీషులో చెప్పేయి. తెలుగులో చెబితే ఇంకా బెస్టు, దెబ్బకి ఏం అడగాలో తెలీక నోరు వెళ్లబెట్టేస్తారు” అన్నాడు రాఘవ.

వాడు చెప్పినట్టే హేతువాద సంఘం వాళ్లు నోళ్లు తెరుచుకుని నా ఇంటర్వ్యూ విన్నారు. రాఘవే వాళ్ల తరపున కొన్ని ప్రశ్నలు వేసి రక్షించాడు– "అశోకవనంలో సీతమ్మవారు కనబడకపోతే ఏమయ్యి ఉండేది?" (రాములవారి ఉంగరం ఆయనకే దక్కేది. అని జవాబు ఇచ్చా). "మీ బలం మీ కెందుకు తెలియదు?" (ఎవరూ బిరుదులు ఇవ్వకపోవడం వల్ల) "చూసి రమ్మంటే కాల్చి వచ్చేరేం?" (ఓ చూపు చూడమన్నారనుకున్నా...).

ముఖ్యంగా నా మేకప్ చూసి వాళ్లు అదిరిపడిపోయారు. ఆ క్రెడిటంతా అచలపతిదే. మాంచి మేకప్‌మేన్‌ని (అతనే కమలహాసన్‌కి 'భామనే, సత్యభామనే'లో స్త్రీ వేషం మేకప్ వేసేట్ట) బేరమాడి పట్టుకువచ్చాడు. ఒంటి మీద బొచ్చులేకుండా, ఎత్తుమూతి లేకుండా, తోక లేకుండా, ఒట్టి బనియన్, డ్రాయరు మీద ఆంజనేయుడి రూపాన్ని స్ఫురించేలా చేశాడు. ఎవర్నీ అడగక్కరలేకుండానే భలానా హనుమంతుడి గారి అవతారం వీరే కదండీ అన్నట్టు తయారయింది వేషం. డాబా మీద వెలుగు తక్కువగా ఉండడంతో నా వింత రూపం హేతువాద సంఘం సభ్యులకు భయం గొలిపినట్టుంది. మరీ దగ్గరకు వచ్చి పరీక్షచేయబోతే దేవుడు శిక్షిస్తాడన్న భయం పట్టుకుంది వాళ్లకు.

నాస్తికులకు దేవుడంటే గౌరవం ఉంటుంది కానీ భక్తులకు బొత్తిగా ఉండదు. 'మనవాడేగా..' అన్నట్టు దగ్గరకు వచ్చేస్తారు. మీద పడి పట్టేసుకుంటారు. నాకూ అదే గతి పట్టింది – జై బజరంగ్‌బలీ దళం చేత. హేతువాద సంఘం వాళ్లు సంకటమోచనుని అవతారాన్ని సంకటాలపాలు చేస్తున్నారని వాళ్లకు కబురు అందిందట. బిరబిరా వచ్చేశారు. చరచరా ట్యాంక్ ఎక్కేశారు. నేను టాంక్‌లోపల దూరేలోపునే చెరో రెక్కా పట్టుకున్నారు.

కన్నుమూసి తెరిచేలోగా, నేను కారులో యూపీభవన్ వైపు సాగిపోతున్నాను. రాబోయే యూపీ ఎలక్షన్‌లలో నేనెంత బాగా పనికొస్తానన్నదానిపై బెట్లు కట్టుకుంటున్నారు. నా చేతిలో వాళ్ల పార్టీ జెండా పెట్టి వీధి వీధి తిప్పిస్తే, ఓట్లన్నీ వాళ్లకేట. లంకాదహనం ప్రత్యక్షపురాణం షో ఏర్పాటు చేయడానికి తన పొలంలో గడ్డి యావత్తు విరాళం ఇస్తానన్నాడొకడు.

పల్లెప్రజలకు బజరంగబలీ మీద గురి ఎక్కువ కాబట్టి త్వరలో రాబోయే పంచాయితీ ఎలక్షన్లలో నేను మరింతగా ఉపయోగపడతానన్న విషయం మీద ఏకాభిప్రాయం

కుదిరింది కానీ అప్పటివరకూ నన్నెక్కడ బందీ చేసి పెట్టాలన్నదానిమీద కుదరలేదు. మా పిల్లలు ఆడుకోవడానికి కావాలని ఒకడంటే, మా పిల్లలకు మరీ సరదా అని ఇంకోడు. నిర్ణయం హైకమాండుకే వదిలేద్దామని ఒప్పందానికి వచ్చేలోగానే యూపీ భవన్‌కి వచ్చిపడ్డాం.

పార్టీపెద్దలకు ఫోన్ చేసి విషయం వివరిస్తూండగానే "తెలుగు హనుమంతుడు –

తెలుగువాళ్ల సొత్తు" అన్న నినాదంతో ఢిల్లీ తెలుగు సమాజం వాళ్లు వచ్చిపడ్డారు.

అందరికంటె ముందు అచలపతి ఉన్నాడు. రాఘవ మేమున్న హోటల్‌కి ఫోన్ చేసి చెప్పాడేమో. అప్పటికప్పుడు జనాల్ని పోగుచేసి వెంటబెట్టుకువచ్చేశాడు అచలపతి. నాకు ఇక నిశ్చింత అనిపించింది. యూపీవాళ్లూ, ఆంధ్రావాళ్లూ నాపై హక్కుల గురించి తీవ్రంగా వాదించుకుంటున్నా కులాసాగా విన్నాను. తెలుగువాళ్లు తమ వాదనకు వత్తాసుగా హేతువాదసంఘం వాళ్ల తీర్పును ఉటంకించారు. ఆ సంఘం వాళ్లు నేను ఆంజనేయుడి అవతారాన్నో, కాదో తెలీదు గానీ తెలుగువాడు అవునని తేల్చారట. నా ఇంగ్లీషు, హిందీలలో తెలుగుయాస కొట్టొచ్చినట్లు కనబడిందట.

ఆంధ్రతేజం మళ్లీ ఓ సారి వెలిగింది. నేను ఇంకోగంట సేపట్లో ఆంధ్రా అసోసియేషన్ బిల్డింగులో వెలిశాను. అప్పటికే అక్కడ పిల్లా, జెల్లా, ఆడా, మగా బోల్డుమంది పోగయ్యేరు – తప్పెట్లు తాళాలతో సహా. నన్ను మధ్యన కూచోబెట్టుకుని అందరూ భజన చేయడం మొదలెట్టారు. చెవులు హోరెత్తి నేను అవస్థ పడుతూంటే కొంతమంది పిల్లలు నా చుట్టూ చేరారు, ప్రశ్నలతో చంపారు.

''హనుమాన్ అంకుల్, మీ తోక ఏది?'' (నడుసుస్తూంటే అడ్డొస్తోందని కలియుగావతారంలో దాన్ని లుప్తం చేసేశాను నాయనా) "సూపర్‌మాన్ అంకుల్, మీరు కారులో వచ్చేరేం, చక్కగా ఎగిరివచ్చేయచ్చు కదా" (పెద్దవాణ్నయిపోయాను కదా, ఎగరడం కష్టంగా ఉంది. ఆకాశంలో ఇదివరకు లేని ట్రాఫిక్ సమస్య ఇప్పుడొచ్చిపడింది. విమానాలు తెగ తిరుగుతున్నాయి) కొంతమంది గడుసుపిల్లలు ధైర్యం చేసి నా ఒళ్లు నిమిరి చూశారు. ఏమైనా మేకప్ వ్యవహారమా అని. అచలపతి పట్టుకొచ్చిన మేకప్‌వాణ్ని మెచ్చుకుని తీరాలి. నా చర్మం మొత్తాన్ని అతి నేచురల్‌గా కోతి చర్మంలా చేసేశాడు. అలా అని మరీ బొచ్చుకూడా పెట్టలేదు. అన్నట్టు అచలపతి ఎక్కడ?

– భజన చేసేవాళ్లలో ఉన్నాడు. నిద్రవస్తోందని సైగ చేశాను. అప్పటికే రాత్రి ఒంటిగంటయింది మరి. వీళ్లలోంచి ఎలా బయటపడతానో తర్వాత చూసుకోవచ్చు. ముందు నిద్రపోతే సగం సమస్యలు వాటంతటవే తీరుతాయన్న ఫిలాసఫీ నాది. అచలపతి గ్రహించాడు. లేచి నిలబడ్డాడు. "మనం ఇక భజనలు ఆపి, విశ్రమించి, పొద్దున్న లేచాక సుప్రభాత సేవతో స్వామివారిని లేపుదాం." అన్నాడు.

కొంతమంది మహిళాభక్తులు "దొరక్క దొరక్క దొరికాడు దేవుడు. మేం పాడితీరుతాం".

అని పట్టుబట్టారు. అచలపతి గుర్తుచేశాడు– మేనకాగాంధీ. అమలా అక్కినేని ఊళ్లోనే ఉన్నారని. ఎవరైనా ఫోన్ చేస్తే వచ్చి పడిపోయి, అంజనేయుల అవతారాన్ని కిడ్నాప్ చేసి అడవుల్లో వదిలిపెట్టేస్తారని. దాంతో వాళ్లంతా చల్లబడ్డారు. అందరికీ తీర్థప్రసాదాలు అచలపతి ఆధ్వర్యంలోనే పంచబడ్డాయి. నాకు మాత్రం ప్రసాదం పెట్టే నాధుడు లేడు. నాకు అలా, అలా అరచేతుల్తో నివేదన చేసేసి వాళ్ల నోట్లోనే గుటుక్కున వేసేసుకున్నారు. అచలపతి కూడా పట్టించుకోలేదు. తనమాట వినకుండా ఈ జంజాటంలో చిక్కుకున్నందుకు వేస్తున్న శిక్షేమో అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

మెలుకువ వచ్చేసరికి తెల్లారుతోంది. హాల్లో లైట్లార్పేసి ఉన్నాయి. జనం హాయిగా నిద్రపోతున్నారు. నేనెక్కడున్నానో తెలియలేదు. లేచి అయోమయంగానే బయటకు వచ్చి నిలబడ్డాను. ఆటో ఒకటి వచ్చి నిలబడింది. ఎక్కి మా హోటల్‌కి పోనియ్యమన్నాను. ఆటోవాడికి డబ్బులిచ్చి పంపమని రిసెప్షనిస్టుకి చెబుతూంటే వాడడిగేడు –'ఏం సార్, జాగింగ్‌కి వెళ్ళినప్పుడు పర్సు పట్టుకెళ్లడం మర్చిపోయారా?' అని. ఊఁ అంటూ ఒంటి మీద చూసుకున్నా! లాగూ, బనీను మాత్రమే ఉన్నాయి. ఏం జరిగిందో ఆలోచించి నన్ను పగలగొట్టడంకంటె ఫాస్ట్‌గా బ్రేక్‌ఫాస్ట్ మెక్కేసి హాయిగా మంచం ఎక్కమంది నా బ్రెయిన్ .

మిట్టమధ్యాహ్నం నిద్రలేచాను, అదీ అచలపతి బెల్ కొట్టడంతో. అచలపతిని చూడగానే గుర్తుకువచ్చాయి– నిన్నటి సంఘటనలు. సూటిగా అడిగేశాను – "నాకు ప్రసాదం పెట్టలేదేం?" అని.

"పెట్టివుంటే మీరూ మత్తులో పడివుండేవారు కదా, సర్! తీర్థప్రసాదాల్లో మత్తుమందు కలపబట్టే కదా, అందరూ అలా పడి నిద్రపోయారు. మీరు చక్కగా బయటకి నడిచి వచ్చేశారు" అన్నాడు అచలపతి తొణక్కుండా.

"బయటకు వచ్చేయడానికి ఆత్మవిశ్వాసం కావాలోయ్, పక్కవాళ్లు నిద్రపోవడం కాదు. నేను విచిత్రకోతిలా ఉన్నాను. బయటకు వస్తే అందరూ వింతగా చూస్తారు, అని భయపడితే అలాగే ఉండిపోయేవాణ్ని. ఎవరేమనుకుంటే నాకేం అని ధైర్యంగా వచ్చేసాను. ఎవడూ పట్టించుకోలేదు". అని మందలించాను.

"అందరూ పట్టించుకోకపోవడానికి నా పొరపాటు కూడా కారణమే సర్. మీకు మేకప్ గురించి చెప్పేటప్పుడు ఒక ముఖ్యమైన విషయం చెప్పడం మర్చిపోయాను. 'భామనే , సత్యభామనే' మేకప్‌మనే కదా మీకూ వేసింది. ఎనిమిది గంటల తర్వాత

ఆ మేకప్ ఆటోమేటిగ్గా కరిగిపోతుందని చెప్పాడు. ఆ విషయం మీకు చెప్పడం మర్చిపోయాను..”

తక్షణం నా శరీరం కేసి చూసుకున్నాను. మామూలుగా ఉంది. అందుకేనన్నమాట, నేను తప్పించుకురాగలిగాను. ఐదు నిమిషాలపాటు నేనేం మాట్లాడలేదు. తనెంత వారించినా చిక్కుల్లోకి దూకే యజమానిని కాపాడడానికి అతనెంత శ్రమించాడో, తలచుకుంటే నాకు కన్నీళ్లు వచ్చాయి. ఆ మేకప్ అలా కరిగి, రాలిపోయివుండకపోతే నేనీపాటికి ఉత్తరప్రదేశ్ గ్రామాల్లో గంతులేస్తూ ఉండాల్సి వచ్చేదేమో. అయినా అవేం కనబడనీయకుండా, గంభీరంగా “సర్లే, ఈ సారికి నీ తప్పుకాశాను. ఇంకెప్పుడూ మర్చిపోక” అనేశాను.